క్లుప్తంగా

అధ్వానంగా లైవ్ షో నిర్వహణ

తిరుపతి సిటీ : ఎస్వీయూ స్టేడియంలో శనివారం రాత్రి నిర్వహించిన సింగర్స్ లైవ్‌షోను అధ్వానంగా నిర్వహించారు. కనీస వసతులు కూడా కల్పించకపోవడంతో ప్రేక్షకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. దాహార్తిని తీర్చుకునేందుకు తాగునీరు సైతం అందుబాటులో లేకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. రూ.వేలు వెచ్చించి టికెట్ కొనుగోలు చేస్తే గ్రౌండ్‌లో కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదని ప్రేక్షకులు మండిపడ్డారు. వాహనాల పార్కింగ్‌కు కూడా సరైన స్థలం కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ధనార్జనే ధ్యేయంగా లైవ్‌షో ఏర్పాటు చేశారని, పరిమితికి మించి టికెట్లు విక్రయించారని విమర్శించారు. నిర్వాహకుల పర్యవేక్షణలోపంపై అసహనం వ్యక్తం చేశారు.

అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి



ఆలయం వెలుపల కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే శనివారం కుటుంబ సభ్యులతో కలసి సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆమెకు ఏఈఓ రమేష్‌బాబు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ప్రసాదాల ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డీఈఓను సత్కరిస్తున్న అప్సా నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రయివేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన డీఈఓ కేవీఎస్.కుమార్ స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా విద్యా శాఖాధికారిగా శనివారం బాధ్యతలు చేపట్టిన ఆయనను రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు ఆధ్వర్యంలో నాయకులు, కరస్పాండెంట్లు కలిశారు. ఈ సందర్భంగా ఇదివరకున్న డీఈఓ డాక్టర్ వీ.శేఖర్, నూతన డీఈఓ కేవీఎస్.కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

ఉద్యాన పంటల పరిశీలన

పాకాల : మండలంలోని పుదిపట్లబైలులో సాగు చేస్తున్న ఉద్యాన పంటలను ఉద్యానశాఖ అధికారి శైలజ శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వంగతోటల్లో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తీగజాతి పంటల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు వనజ పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన

తిరుపతి సిటీ : పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఇండియన్ యూత్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎస్పీడబ్ల్యూ కళాశాల విద్యార్థులకు విపత్తుల సమయంలో తీసుకోవాలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలిచే విధానాలను వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ ప్రతీత్, సుబ్బారావు, స్టూడెంట్స్ కౌన్సిల్ ఇన్‌చార్జి బి.జ్యోతి పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు చంద్రబాబే అడ్డు



మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి తుడా : నగరంలో 7,800 మంది పేద మహిళలకు మంజూరు చేసిన ఇళ్లను చంద్రబాబే అడ్డుకున్నారని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. శనివారం ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెలలోపు ఇళ్ల సమస్య పరిష్కరించకుంటే క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడతామని హెచ్చరించారు. అమరావతిలో మంత్రులు, వీఐపీలు ఎన్ని ఎకరాలు కొనుగోలు చేశారో వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణానికి 50 వేల ఎకరాలు అవసరమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు గోపి గౌడ్, రవి, రావణ్, తేజోవతి, శాంతి యాదవ్, ముని శోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

కర్ణం.. జర భద్రం



- శ్రవణ శక్తిని దెబ్బతీస్తున్న ఆధునిక పరికరాలు
- ఇయర్ బడ్స్, హెడ్ ఫోన్స్‌ను మితిమీరి వినియోగిస్తే ప్రమాదం
- చిన్న వయసులోనే వినికిడి లోపం వస్తుందంటున్న వైద్యులు

ఆధునిక సమాజంలో టెక్నాలజీ వినియోగం పెరిగింది. అందరి చేతుల్లోకి సెల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చేసింది. ఈ క్రమంలోనే ఇయర్ బడ్స్.. హెడ్‌ఫోన్స్ వాడకం అధికమైంది. ముఖ్యంగా యువత జీవనశైలిలో ప్రధాన అవసరంగా మారిపోయింది. అయితే చెవులను హోరెత్తించే ధ్వనుల కారణంగా చిన్నవయసులోనే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మితిమీరి ఉపయోగిస్తే వినికిడి లోపం తలెత్తే అవకాశముంది. శ్రవణశక్తిని సైతం పూర్తిగా కోల్పోయే ప్రమాదముంది.

తిరుపతి మంగళం : ఇంట్లో, ఆఫీసుల్లో ల్యాప్‌టాప్స్ పట్టుకుని చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని పనిచేయడం, రోడ్డు మీద డ్రైవింగ్ చేసేటప్పుడు ఇయర్ బడ్స్ పెట్టుకుని సంగీతాన్ని ఆస్వాదించడం. ఇవి సరిపోవన్నట్టు వీకెండ్స్‌లో చెవులు చిల్లులు పడే మ్యూజిక్ హోరులో మునిగి తేలడం.. ఇవన్నీ నగరంలో టీనేజర్లు, యువత రొటీన్‌గా చేసే పనులు. అయితే ఈ రకమైన పద్ధతుల కారణంగా భవిష్యత్‌లో వినికిడి లోపాలు వచ్చే అవకాశాలున్నాయి. పలు అధ్యయనాలు సైతం ఇదే వాస్తమని ధ్రువీకరిస్తున్నాయి.

టిన్నిటస్ సమస్యే ఎక్కువ

నగర వాసుల్లో కొందరికి చిన్న వయసులోనే వినికిడి లోపాలతో పాటు టిన్నిటస్ అనే ఒక సమస్య పెరుగుతోందని గుర్తించాం. టిన్నిటస్ అంటే ఫోన్ రింగింగ్, ఇతర శబ్దాలు పదే పదే తలలో, చెవుల్లో గింగురుమనడం. ఇలాంటి ఫాంటమ్ సెన్సేషన్స్ కారణంగా చాలామంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మరి కొందరు దీర్ఘకాలిక చెవి నొప్పిని అనుభవిస్తున్నారు. తీవ్రమైన శబ్దాలు, తద్వారా కలిగే అసౌకర్యాన్ని నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వినికిడి లోపానికి దారి తీస్తాయి. అలాగే డిప్రెషన్, డిమెన్షియా, మతిమరుపు వ్యాధుల తీవ్రత కూడా పెరిగే అవకాశముంది.

– ప్రవీణ్‌కుమార్, ఇఎన్‌టీ వైద్యుడు

నష్ట నివారణ అత్యవసరం

గతంలో వెలువడిన ఓ పరిశోధన ఫలితాల ప్రకారం పీఎల్‌డీ వినియోగదారులు తరచూ 106 డెసిబుల్స్ కంటే ఎక్కువ వాల్యూమ్‌ను ఎంచుకుంటారు. వినోద వేడుకల్లో సగటు ధ్వని స్థాయి 104 నుంచి 112 డెసిబుల్స్ మించి ఉంటుంది. అయితే వైద్యులు అనుమతించిన స్థాయి పెద్దలకు 80 డెసిబుల్స్, పిల్లలకు 75 డెసిబుల్స్ మాత్రమే కావడం గమనార్హం. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు సురక్షితమైన వినికిడి మార్గాలను ప్రోత్సహించడం ద్వారా నష్ట నివారణకు ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరమని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.



అత్యధికంగా యువతే..!

సురక్షితం కాని శ్రవణ విధానాలు9 అవలంబించడం వల్ల ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది వినికిడి శక్తిని కోల్పోతున్నారని తాజా పరిశోధనలతో తేలింది. వీరిలో అత్యధికులు యువత, టీనేజర్లే కావడం ఆందోళనకరం. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన ఈ పరిశోధన ఫలితాలు బీఎంజే గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ప్రచురించారు. దీని ప్రకారం పరిమితికి మించి స్మార్ట్‌ఫోన్లు, హెడ్‌ఫోన్లు, ఇయర్ బడ్స్ వంటి వ్యక్తిగత శ్రవణ పరికరాలు (పర్సనల్ లిజనింగ్ డివైజెస్/ పీఎల్‌డీలు) ఉపయోగించడం, పెద్దగా ధ్వనించే సంగీత వేదికలు యువత వినికిడి సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 24 శాతం మంది టీనేజర్లు, 48 శాతం మంది యువత పరిమితికి మించి చెవులకు పనిపెడుతున్నారని పరిశోధనలో తేలింది. ఈ సంఖ్యల ఆధారంగా పరిశోధకులు ప్రపంచ వ్యాప్తంగా 0.87.135 బిలియన్ల మంది మధ్య, యుక్తవయసుకులు వినికిడి లోపానికి గురవుతున్నారని లెక్క గట్టారు.



అనగనగా ఓ ట్రాక్టర్!

– తిరుపతిలో చోరీ...తిరుత్తణిలో ప్రత్యక్షం

తిరుపతి రూరల్: ఇంటి వెనుక నిలిపిన ట్రాక్టర్ అర్ధరాత్రి మాయమై.. చెన్నైలోని తిరుత్తణిలో ప్రత్యక్షమైన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాలు.. తిరుపతి రూరల్ మండలం, యోగిమల్లవరం సరస్వతీ నగర్‌కు చెందిన జానకీరామ్ తన మూడు ట్రాక్టర్లను శ్రీనివాసపురం పంచాయతీలోని ఇంటి వద్ద ఉంచాడు. శుక్రవారం రాత్రి ఓ ట్రాక్టర్‌ను దొంగలు చోరీచేశారు. శనివారం గుర్తించిన యాజమాని తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే మధ్యాహ్నం తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి పోలీసులు ట్రాక్టర్‌పై ఉన్న యాజమాని ఫోన్ నంబర్‌కు ఫోన్ చేశారు. ఓ వ్యక్తి బాగా తాగి ట్రాక్టర్‌పై వస్తూ రోడ్డుపై ఉన్న ఓ వ్యక్తిని ఢీకొట్టినట్లు సమాచారం తెలిపారు. దీంతో జానకీరామ్ తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మూర్తి తిరుత్తణికి వెళ్లి పోలీసులతో మాట్లాడి చోరీకి గురైన ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చారు. ట్రాక్టర్ యాజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపు దుర్మార్గం

తిరుపతి కల్చరల్: టీడీపీ కూటమి ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానానికి భిన్నంగా విద్యుత్ చార్జీలను 44 శాతం పెంచి ప్రజలపై పెనుభారం మోపడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ధ్వజమెత్తారు. తాము విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారం మోపడం సిగ్గుచేటన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో 2024 నవంబర్ నుంచి 2026 జనవరి వరకు యూనిట్‌కు 83 పైసలు చొప్పున 15 నెలల పాటు వినియోగదారులు అదనంగా చెల్లించాల్సి వస్తుందని ఆరోపించారు. దీనిపై ప్రజలు తిరగబడకపోతే 2024-25 ఆర్థిక ఏడాది సర్దుబాటు చార్జీలను 2026-2027లో అదనంగా చెల్లించాల్సి వస్తుందని తెలిపారు.

తిరుచ్చిపై శ్రీనివాసుని విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం కనులపండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వైభవంగా ఊంజల్ సేవ జరిపించారు. ఈ క్రమంలోనే సర్వాలంకారభూషితులైన దేవదేవేరులను తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ రమేష్ బాబు, ముని బాలకుమార్, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

వెంకన్న సేవలో నందమూరి రామకృష్ణ

శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారిని నందమూరి రామకృష్ణ సేవించుకున్నారు. ఆలయ వద్ద ఆయనకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జాతీయ సదస్సు బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ గణిత విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 22వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు శనివారం విడుదల చేశారు. వీసీ మాట్లాడుతూ మ్యాథమేటిక్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్–2024 అనే అంశంపై డిసెంబర్ 22, 23 తేదీలలో జాతీయ సదస్సు ఉంటుందన్నారు. విద్యార్థులు, పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ జయసుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ తులసి రామకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వీ.పద్మావతి, సుధాకరయ్య, భారతి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం



జెండా ఆవిష్కరిస్తున్న రాఘవరెడ్డి, లేబూరి రత్నకుమార్

తిరుపతి రూరల్: విద్యుత్ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా 70 ఏళ్ల పాటు సేవలందించిన కార్మిక సంఘం ఏపీ స్టేట్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ అని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ రాఘవరెడ్డి కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీ, ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు సంజీవరెడ్డి నేతృత్వంలో ఏపీఎస్ఈఈయూ–327 యూనియన్ ముందుకెళ్తోందన్నారు. ఐఎన్‌టీయూసీ యూనియన్ సహకారంతో వేల కుటుంబాలు సంతోషకరంగా ఉన్నాయని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు సైతం ధైర్యంగా తమ విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల కార్మికుల కష్టాలను గుర్తించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఐఎన్‌టీయూసీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు లేబూరి రత్నకుమార్ డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

తిరుమల : తిరుమలలోని ఎస్వీ మ్యూజియంలో చేపట్టిన అభివృద్ధి పనులను టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి శనివారం పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. త్వరితగతిన మ్యూజియాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీటీడీ మ్యూజియం ఆఫీసర్ విజయలక్ష్మి, డిప్యూటీ ఈఓ (హెల్త్) శ్రీమతి ఆశాజ్యోతి, ఈఈ–1 సుబ్రమణ్యం, డీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న గౌడ సంఘం సభ్యులు

పాకాల : మండలంలోని చిగరపల్లె మృతి చెందిన టి.యశోదమ్మ(60) అంత్యక్రియలకు ఈడిగ గౌడ సంఘం సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. శనివారం ఈ మేరకు మృతురాలి కుటుంబీకులకు రూ.7,500 అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్, సెక్రటరీ శ్రీనివాసులు, సభ్యులు సుధా గౌడ్, జీవన్‌కుమార్, రవి, శివ పాల్గొన్నారు.

ఎస్సీ సంక్షేమ మండలి సభ్యుడిగా ప్రదీప్



తిరుపతి కల్చరల్ : జాతీయ ఎస్సీ సంక్షేమ మండలి సభ్యుడిగా తిరుపతికి చెందిన మించల ప్రదీప్‌ను నియమిస్తూ ఆ సంస్థ సంయుక్త కార్యదర్శి వి.ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రదీప్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను బహుజనులకు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సమాచార చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీ విజయ్ భాస్కర్

చంద్రగిరి : మండలంలోని మఠంపల్లెలో శనివారం సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏపీ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ చట్టం తెలుసుకుంటే ప్రభుత్వ విధివిధానాలు అర్థమవుతాయన్నారు.

ఘనంగా ఆయుధ పూజ

తిరుమల : టీటీడీ రవాణా శాఖ తిరుమల విభాగంలోని వర్క్‌షాపులో శనివారం ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. టీటీడీ అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ వాహనాలను పుష్పాలు, తోరణాలతో అలంకరించారు. శ్రీవారికి విశేష పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈఓ భాస్కర్ పాల్గొన్నారు.

రేపే పోలింగ్

- పకడ్బందీగా టీటీడీ సహకార బ్యాంక్ ఎన్నికలు
- 7 డైరెక్టర్ పదవులకు 35 మంది ఉద్యోగులు పోటీ



టీటీడీ పరిపాలన భవనం

తిరుపతి సిటీ: టీటీడీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ (టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంక్) ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం జరగను్న పోలింగ్‌కు తిరుమల ఎస్వీ హైస్కూల్, తిరుపతి ఎస్జీఎస్ హైస్కూల్‌లో పోలింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధం చేశారు. ఏడు డైరెక్టర్ పదవులకు 51 నామినేషన్లు రాగా, ఉపసంహరణ తర్వాత 35 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

2019 నుంచే ఎన్నికలు

టీటీడీ కో–ఆపరేటీవ్ బ్యాంక్ 1951లో అప్పటి ఈఓ చెలికాని అన్నారావు హయాంలో ప్రారంభమైంది. 1951 నుంచి 1964వరకు దీర్ఘకాలం ఆయనే టీటీడీ బ్యాంకు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. అప్పటి నుంచి 2018 డిసెంబర్ వరకు ఐఏఎస్‌ల పాలనలోనే నడుస్తూ వచ్చింది. 2019లో ప్రభుత్వ సహకార బ్యాంకు చట్టాలలో మార్పులు తీసుకొచ్చింది. దీంతో అప్పటి నుంచి ఉద్యోగుల అభీష్టం ప్రకారం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది.

పోలింగ్ విధుల్లో 150 మంది

సోమవారం ప్రతిష్టాత్మకంగా జరగనున్న టీటీడీ సహకార బ్యాంక్ ఎన్నికల కోసం సుమారు 150 మంది ఉపాధ్యాయులను పోలింగ్ విధులకు నియమించారు.

సాయంత్రం 6పైన కౌంటింగ్

షెడ్యూల్ ప్రకారం సోమవారం ఓటింగ్ ప్రక్రియ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనుంది. రెండు గంటల విరామం అనంతరం తిరుమల పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్స్‌లకు తిరుపతి ఎస్జీఎస్ కళాశాలలో ఏర్పాటు చేసి కౌంటింగ్ కేంద్రానికి తరలించనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది.

సర్వం సిద్ధం

టీటీడీ బ్యాంక్ ఎన్నికలకు సర్వ సిద్ధం చేశామని ఎన్నికల అధికారి ఉమాపతి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఒక్కొక్కరు ఏడు ఓట్లు మాత్రమే వేయాలని సూచించారు.

తుడా టవర్స్ పనుల వేగవంతం



బ్రోచర్ విడుదల చేస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : తుడా టవర్స్ నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు మున్సిపల్ కమిషనర్, తుడా వైస్ చైర్మన్ మౌర్య తెలిపారు. శనివారం అధికారులతో నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 2026 మార్చి నాటికి తుడా టవర్స్ అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. తుడా టవర్స్‌ను 3.6ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 13అంతస్తులు ఉంటాయని చెప్పారు. మొదటి అంతస్తులో వాణిజ్య సముదాయం, మరో రెండు అంతస్తుల్లో కార్యాలయాలు, మిగిలిన ఫ్లోర్‌లలో నివాస యోగ్యమైన 230 ప్లాట్లు ఉంటాయని వివరించారు. 42 డబుల్ బెడ్‌రూమ్స్, 152 ట్రిబుల్ బెడ్‌రూమ్స్, 32 నాలుగు బెడ్ రూమ్ ప్లాట్లు ఉంటాయని తెలిపారు. దీనిపై విస్తృత ప్రచారం చేసేందుకే బ్రోచర్ విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కార్యదర్శి వెంకటరమణ, ఎస్ఈ కృష్ణారెడ్డి, సలహాదారుడు రామకృష్ణారావు, ఈఈ రవీంద్రయ్య, ఈడీ సునీకుమార్ పాల్గొన్నారు.


పార్టీలకు అతీతంగా అభివృద్ధి

భాకరాపేట : పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. శనివారం నిర్వహించిన ఎర్రావారిపాళెం మండలం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

భూమి పూజ

ఎర్రావారిపాళెం మండలంలోని నెరబైలు, చింతగుంట పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పులివర్తి నాని భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.2.70 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు.

ఎస్వీ మెడికల్ కాలేజీలో పేరెంట్స్ మీటింగ్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రశేఖరన్

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ అధ్యాపకులే కాకుండా తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. అప్పుడే ఉత్తమంగా విద్యను అభ్యసించి సంఘంలో మెరుగైన వైద్యుడిగా పేరుపొందగలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, (పరిపాలన), బాలుర వసతి గృహం వార్డెన్ డాక్టర్ తులసీరామ్, బాలికల వసతి గృహం వార్డెన్ డాక్టర్ థెరిసా రాణి, డాక్టర్ షమీం, పీఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

వేలం వాయిదా

తిరుపతి కల్చరల్ : శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో వివిధ పనుల లీజు నిమిత్తం శనివారం నిర్వహించాల్సిన బహిరంగ వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు ఈఓ జయకుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు వెల్లడించారు.

తిరుపతిలో మద్యం, మాంసం నిషేధించాలి

– జాతీయ హిందూ ధార్మిక సదస్సులో సాధు పరిషత్ తీర్మానం

చంద్రగిరి (తిరుచానూరు) : దేశంలోనే ఏ ప్రముఖ పుణ్యక్షేత్రానికి వెళ్లినా 10 కిలో మీటర్ల దూరం వరకు ఎక్కడా మద్యం, మాంసం దుకాణాలు కనిపించవని.. కానీ, తిరుపతిలోకి అడుగుపెట్టగానే అవే దర్శనమిస్తున్నాయని రాష్ట్ర సాధు పరిషత్ రక్షణ సమితి అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి అన్నారు. పవిత్రమైన పుణ్యక్షేత్రం తిరుపతిలో ఇలాంటి పరిస్థితి ఉండడం శ్రీవారి భక్తులను తీవ్రంగా కలిచివేస్తోందన్నారు. తిరుపతిలో వాటిని నిషేధించాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుచానూరులోని ఓ ఫంక్షన్ హాలులో శనివారం జాతీయ హిందూ ధార్మిక సదస్సు–2024 జరిగింది. ఈ కార్యక్రమానికి దాదాపు 300 మంది హిందూ సాధువులు, పలు హిందూ మత పరిరక్షణ సంఘాలు, పలువురు మఠాధిపతులు పాల్గొన్నారు. వివిధ అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చలు జరిపి తీర్మానాలను చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలతో పాటు తిరుపతి పవిత్రతను కాపాడడం ప్రతి ఒక్క హిందువు బాధ్యతని అన్నారు. ఇందులో భాగంగా తిరుపతి నగరంలో మద్యం, మాంసం పూర్తిగా నిషేధించాలని జాతీయ హిందూ ధార్మిక సదస్సు తీర్మానం చేసిందన్నారు. దివంగత సీఎం ఎన్టీఆర్, దివంగత రాష్ట్రపతులు శంకర్‌దయాళ్ శర్మ, కేఆర్ నారాయణన్ వంటి మహనీయులు తిరుపతిని గొప్ప క్షేత్రంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారని.. కానీ, తిరుపతికి రాగానే మద్యం, మాంసాలు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. హిందువుల ఆరాధ్య దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిపట్ల భక్తిభావంతో తిరుపతికి వెళ్లాలే తప్ప ఇలా మద్యం, మాంసాల దుకాణాలను చూసుకుంటూ వెళ్లడం మంచిది కాదన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశంలో బిల్లును ప్రవేశపెట్టి తిరుమల, తిరుపతిని పవిత్రమైన పుణ్యక్షేత్రంగా సీఎం ప్రకటించాలని కోరారు. స్వామి దయానంద స్వామీజీ, శ్రీనివాసనంద స్వామీజీ, భైరవానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.